క్లుప్తంగా

నేడు 45, 25 వార్డుల్లో 'జగనన్న సురక్ష'

సీతంపేట: జీవీఎంసీ 45, 25 వార్డుల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరగనుంది. 45వ వార్డు వాసుదేవనగర్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని వార్డు కార్యాలయం వద్ద ఉదయం 11 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. సమావేశం అనంతరం జగనన్న సురక్ష ద్వారా సేవలు పొందాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల ఆఫీసర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయ కార్యదర్శులు, అడ్మిన్లు, వలంటీర్లు, ఆర్పీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొనాలని ఆయన కోరారు.

లలితా పీఠంలో చండీ హోమం నేడు

సీతంపేట: ఆషాఢ మాసం బహుళ అష్టమి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 7 గంటలకు కాలభైరవ హోమం జరుగుతుందని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ



ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: సేవా కార్యక్రమంలో భాగంగా దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం అన్నార్తులకు ఆహారం పొట్లాలు అందజేశారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో సామాజిక వేత్త, దళిత సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లమాల అప్పారావు ముఖ్య అతిథిగా సుమారు 350 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ మీనా, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర సెక్రటరీ పట్నాల ఝాన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు అష్టమి పూజలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ మాస శుద్ధ అష్టమి సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, సిబ్బంది పర్యవేక్షించారు.

సుందరంగా వైభవుడి ఉద్యానవనం

- ప్రజాప్రతినిధుల చొరవతో పార్కు ఆధునికీకరణ
- కళావేదిక, పాత్‌వే నిర్మాణం
- ఓపెన్ జిమ్, పిల్లల ఆటపరికరాల ఏర్పాటు.. గ్రీనరీ పెంపు



పార్కు ముఖద్వారం



ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి వారి పార్కులో పచ్చదనం

మురళీనగర్: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి వారి పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధర్యంలో నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వైభవుడి ఉద్యానవనంలో పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొన్ని సదుపాయాలు అందుబాటులోకి రాగా.. మరికొన్నింటి కల్పనకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పార్కు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారు.

అసోసియేషన్ కృషి.. దాతల సహకారం

రెండు దశాబ్దాల కిందట ఎన్‌జీజీవోస్ కాలనీతో పాటు పార్కు సౌకర్యానికి మూడు వేల గజాల స్థలాన్ని కేటాయించారు. అప్పుడు దీన్ని పట్టించుకున్న నాథుడే లేదు. దీంతో ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ స్థానికుల సహకారంతో ప్రహరీ గోడ నిర్మించి పార్కుకు ఒక రూపాన్ని తీసుకొచ్చారు. సంయుక్త యూత్ అసోసియేషన్ సభ్యులు దీని బాధ్యతను తీసుకుని పూర్తి చేశారు. జీవీఎంసీ వీరికి తాగునీటి బోరు సౌకర్యం కల్పించింది. కాలనీలోని దాతల సహకారంతో రూ.2 లక్షలతో కళావేదికను నిర్మించారు. పాత్‌వే నిర్మాణం, గ్రీనరీని రెసిడెంట్స్ అసోసియేషన్ సహకారంతో అభివృద్ధి చేశారు.

నూతన సౌకర్యాలు

పార్కులో నూతన సౌకర్యాల కల్పనకు కార్పొరేటర్ అల్లు శంకరరావు చొరవ తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ పరికరాలు ఇటీవల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాంపౌండ్ వాల్ పెయింటింగ్, ఆర్ట్ వర్క్‌కు సుమారు రూ.5 లక్షల మంజూరు చేశారు. ఈ పనులను కె.కె.రాజు ఇటీవల ప్రారంభించారు. వీటితో పెయింటింగ్స్, మ్యూనరల్ ఆర్ట్స్, 15 సిమెంట్ బెంచీలు నిర్మిస్తారు. పిల్లల ఆట పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. పిల్లల కోసం జారుడు బల్ల, రంగుల రాట్నం, సీసా పరికరాలు ఇంకా రావాల్సి ఉంది. షటిల్ కోర్టు ఫ్లోరింగ్ కాంక్రీటు పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. పార్కు లోపల హెడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి. పార్కు చివరలో ఒక లైటు అవసరం ఉంది.



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు

ఆరోగ్యమే మహాభాగ్యం

నూతనంగా 42 మందితో వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. వైభవ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సభ్యులు కృషి చేస్తున్నారు.

అందరి సహకారంతో పార్కు అభివృద్ధి



వైభవ వేంకటేశ్వర స్వామి వారి పార్కును స్థానిక కార్పొరేటర్‌తోపాటు, వెల్ఫేర్ అసోసియేషన్, వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నాం. చాలా పనులు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు దాతల సహకారం అవసరం. వైభవ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం.
– కె.రామచంద్రరాజు, పార్కు కార్యదర్శి

రచనలతో సామాజిక చైతన్యం



రచయిత సుగుణరావుకు నగదు బహుమతి అందజేస్తున్న డాక్టర్ రామశర్మ

సీతంపేట: సామాజిక చైతన్యం కలిగించే శక్తి సాహిత్యానికి ఉందని రచయిత, దండెంరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్.వి.రామశర్మ అన్నారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బాలల ఉగాది కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. అక్షరాలతో సమాజాన్ని చైతన్యం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న సాంఘిక చర్యలను ఎత్తి చూపుతూ వాటికి పరిష్కార మార్గాలని తెలియజేస్తూ రచనలు చేయాలని సూచించారు. మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మక్కెన శ్రీను మాట్లాడుతూ పిల్లల్లో నైతిక విలువలు, సృజనాత్మకత పెంపొందించడానికి బాలసాహిత్యం దోహదపడుతుందన్నారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ 11 ఏళ్లుగా తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కథల పోటీల్లో ప్రథమ స్థానంలో డాక్టర్ సి.వి.సర్వేశ్వర శర్మ(అమలాపురం), ద్వితీయ స్థానంలో డాక్టర్ ఎం.సుగుణరావు(విశాఖ), తృతీయ స్థానంలో వేణు మరోదు(ఖమ్మం) నిలిచారు. వీరికి అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. మరో 9 మందికి రచయితలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో కథా రచయిత గడ్డం దేవీప్రసాద్, రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, సుసర్ల సర్వేశ్వరశాస్త్రి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్లాట్‌ఫాం నంబర్ 6 వద్ద వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 6 వద్ద ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మరణించాడు. జీఆర్పీ సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆయన తెలిపిన వివరాలిలా.. ఆదివారం ఉదయం ప్లాట్‌ఫాం నంబర్ 6లో సుమారు 60–65 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. మృతుడి ఎత్తు 5.4 అంగుళాలు. సిమెంట్ రంగు ఫుల్ ప్యాంట్, పసుపు, నీలం రంగు గీతలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడు. ఇతడి గురించి సమాచారం తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 96661 22722/94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్‌ఐ బాలాజీరావు కోరారు.

మంచిగా మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా అందరితో మంచిగా మెలగాలని సూచించారు. తగాదాలు, గొడవల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు అప్పగించారు.

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలు చేయకుండా మంచిగా నడుచుకోవాలన్నారు.

13న సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



రవీంద్రనగర్‌లో కొలువైన సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో ఆషాఢ మాస బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 13న ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ తెలిపారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాలసర్ప, కుజ రాహు కేతు దోష నివారణకు ప్రత్యేక పూజలు జరుతుతాయని చెప్పారు. గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం దీపారాధన, సుబ్రహ్మణ్య స్వామిని పల్లకీలో ఊరేగిస్తామని, భక్తులు పాల్గోవాలని ఆయన కోరారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఉద్యోగార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు



యువతకు పుస్తకాలు అందిస్తున్న హేమంత్‌కుమార్

సీతమ్మధార: ఉద్యోగ వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచి మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ కోరారు. ద్వారకానగర్‌లోని వినాయకుడి గుడి వద్ద ఆదివారం నిరుద్యోగ యువతకు కాంపిటీటివ్ బుక్స్, అరకు విద్యార్థులకు పుస్తకాలు, ఆదివాసీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పోటీ పరీక్షల మెటీరియల్‌ను అభ్యర్థులకు ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్–2, అన్ని కాంపిటేటివ్ పోటీ పరీక్షలకు సంబంధించి మెంటల్ ఎబిలిటీ పుస్తకాలను యువతకు ఇచ్చినట్లు చెప్పారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు గత సచివాలయ తరహాలో 15 గ్రేస్ మార్కులు వేసి ఆదుకోవాలని, ప్రభుత్వ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా ఉచిత సడీ మెటిరియల్ ఇవ్వాలని కోరారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మర్రిపాలెం: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. శనివారం అర్ధరాత్రి దాటాకా కంచరపాలెం పోలీసులు హెడ్ కానిస్టేబుల్ పి.వి.ఎల్.నరసింహం, ఐదుగురు కానిస్టేబుళ్లు కలిసి దాడులు నిర్వహించగా.. సింగరాయి మెట్ట వద్ద ఆరుగురు వ్యక్తులు ఆరుబయట పేకాట ఆడుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.41,840 నగదు, 4 చిన్న ఫోన్లు, ఒక స్మార్ట్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రీయ నృత్యంలో శ్రీనిధి ప్రతిభ



అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమొంటో అందుకుంటున్న చిన్నారి శ్రీనిధి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ–2 ప్రాంతానికి చెందిన చిన్నారి ఎ.ఎల్.శ్రీనిధి శాస్త్రీయ నృత్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపింది. ఆంధ్రా యూనివర్సిటీలో నాట్యరవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా 34వ సంగీత నృత్య పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించింది. వరాహగిరి కాలనీ–2 శివాలయ అర్చకుడు అంబటిపూడి సుధీర్‌శర్మ కుమార్తె శ్రీనిధి భరత నాట్యంలో రెండో స్థానంలో నిలిచి అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం చిన్నారి శ్రీనిధిని తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

ఎంజీఎఫ్ సభ్యులకు ఘన సత్కారం



బాల చెన్నయ్యను సత్కరిస్తున్న శుభ

మురళీనగర్: అనకాపల్లిలో ఆదివారం నిర్వహించిన వాకర్స్ జిల్లా 101 క్యాబినెట్ సమావేశంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ ఫెలోషిప్(ఎంజీఎఫ్) సభ్యులుగా 16 మంది చేరారు. వీరి చేరిక పత్రాలను 101 గవర్నర్ యు.శుభకు చంద్రమౌళి అందజేశారు. ఈ సందర్భంగా కొత్త సభ్యులు ఎ.బాలచెన్నయ్య, బి.వరాహ నరసింహమూర్తి, డి.కుమార్, ఎస్.శ్రీనివాసరావు, కృష్ణన్ కుంజు సురేష్, ఎస్.రామ్మోహన్ రావు తదితరులను మహాత్మా గాంధీజీ పతకాలతో శుభ సత్కరించి అభినందించారు.

నిరాశ్రయులకు వసతి



నిరాశ్రయులను నైట్ షెల్టర్ మేనేజర్ మమతకు అప్పగిస్తున్న కంచరపాలెం పోలీసులు

గోపాలపట్నం: కంచరపాలెం పరిధిలోని పలువురు నిరాశ్రయులైన యాచకులను ఐదో పట్టణ పోలీసులు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నైట్ షెల్టర్‌కు ఆదివారం తరలించారు. వీరు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సుమారు 9 మందిని నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వీరిని చేర్పించుకున్నారు. వీరికి ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి వసతి కల్పించారు. ఎస్‌ఐలు జి.రాజారావు, కె.కె.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు



రోల్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి

మురళీనగర్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కళ ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ముందుగా రమణమూర్తి టాస్ వేసి టీమ్‌లకు రోల్‌బాల్‌ను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 3వ జిల్లా స్థాయి అండర్ 11, అండర్ 14 పురుషులు, మహిళల రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 200 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. విజేతలకు పైడి వెంకటరమణమూర్తి, సనపల వరప్రసాద్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అసోసియేషన్ కార్యదర్శి పొట్నూరు నాగరాజు, శాంతి భూషణ్, సురేష్, సూర్యనారాయణ, సౌత్ ఇండియా రోల్ బాల్ కోచ్ అనిల్, విశాఖపట్నం రోల్ బాల్ కోచ్ పి.సంతోష్ పాల్గొన్నారు.

'మరో గ్రంథాలయ ఉద్యమానికి సిద్ధం కండి'



మరో గ్రంథాలయ ఉద్యమ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వెంకటపతిరాజు, ఉపాధ్యాయులు

మురళీనగర్: పుస్తక పఠనంపై విద్యార్థులు, ప్రజల ల్లో అవగాహన కల్పించడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు 'మరో గ్రంథాలయ ఉద్యమం' ప్రతినిధి బి.వెంకటపతిరాజు చెప్పారు. పుస్తక పఠనం ప్రాధాన్యతపై మాధవధార ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పుస్తక పఠనం ప్రాధాన్యత తగ్గిపోతోందని, వచ్చే దశాబ్దంలో పుస్తకం అంతరించే ప్రమాదం ఏర్పడిందన్నా రు. పుస్తక పఠనంలో ఉన్న ఆనందం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలని కోరారు. సెల్‌ఫోన్ రుగ్మత నుంచి విద్యార్థులను బయటపడేలా చేయాలన్నా రు. ఈనెల 16వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహిస్తామని ఇందులో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా మహాసభ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు పెద్ది నాయుడు, కె.శ్రీనివాస్, టి.రామకృష్ణ, ఆర్.రమణమ్మ, విజయశ్రీ, ఉమాపతి, సునీత, నీరజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరి



సదస్సులో పాల్గొన్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్(వైసీటీ)తో సంయుక్తంగా ఏయూ అనుష్ఠాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్ అనే అంశంపై ఈ సదస్సు నిర్వహించాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన తప్పనిసరని చెప్పారు. బెంగళూరు వ్యాస యూనివర్సిటీ వీసీ డాక్టర్ నాగేంద్ర మనుషుల్లో పెరిగే మానసిక ఒత్తిడి పర్యవసానాలు–ఆరోగ్య సమస్యలు అనే అంశంపై ప్రసంగించారు. వ్యక్తి ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ యోగా కేంద్రం విశ్వవిద్యాలయానికి అతి పెద్ద వనరుగా నిలుస్తోందన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని నివారించడం, నియంత్రించడంలో యోగా విధానాలు, ఉపయోగాలను వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య కె.రమేష్‌బాబు, సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ సి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఏయూ అధికారులు



మొక్క నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ అధికారులు మొక్కలు నాటారు. ఆదివారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా పాల్గొని కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక భాగంలో నూతనంగా అభివృద్ధి చేసిన రహదారికి ఇరువైపులా వేప, కదంబం, నాగలింగం, పొన్న, పొగడ, వెలగ, గంగవాలి, రేల, జకరందం, రావి, మర్రి, అడవి జువ్వి తదితర జాతులకు చెందిన మొక్కలను నాటారు. త్వరలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వీసీ తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, డీన్ ఆచార్య జి.వీర్రాజు, శ్రీధర్, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో విజిబుల్ పోలీసింగ్



బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో సాగరతీరాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ఆర్కేబీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు మరింత నిఘా పెంచారు.